
బీఆర్ఎస్‌లో చేరిన రాంనాయక్‌తండా ప్రజలతో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

# గులాబీ గుబాళింపు

- బీఆర్ఎస్‌కు రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సమక్షంలో

**బీఆర్ఎస్‌లో చేరిన 150 మంది కాంగ్రెస్ కార్యకర్తలు**

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 30 : కొడంగల్ నియోజకవర్గంలో గులాబీ గుబాళిస్తున్నది. బీఆర్ఎస్ పార్టీకి సబ్బండ వర్గాల నుంచి ఆదరణ పెరుగుతున్నది. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి సకల జనులు మద్దతుగా నిలుస్తున్నారు. బొంరాస్‌పేట మండలంలోని పూర్యానాయక్‌తండా, రాంనాయక్‌తండాలకు చెందిన 150 మంది కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వార్డు సభ్యులు విఠల్‌నాయక్, విశాల్, రాజు, రవి, చందర్, పూన్‌సింగ్, అనిల్, నరేశ్, బుగ్యా, రమణీబాయి, మణిబాయి, సాలీబాయి, గమిలీబాయి, హరినాయక్, శంకర్‌నాయక్, రాజూనాయక్, మోహన్, వినోద్, లక్ష్మణ్‌నాయక్ తదితరులకు ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నా, ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నా ప్రజలు మరోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వస్తారని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని చెప్పారు. మంత్రి కేటీఆర్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవడంతో కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సీఎం కేసీఆర్ కృషితో తండాలు గ్రామపంచాయతీలుగా మారాయని, తండాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని నరేందర్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాటలకు మోసపోరాదని ఎమ్మెల్యే సూచించారు. జడ్పీటీసీ చౌహాన్ అరుణాదేశు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృషితో మండలంలోని గిరిజన తండాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయని చెప్పారు. మారుమూల గ్రామాలు, తండాల అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారని, ఆయనకు మనమందరం అండగా ఉండాలని జడ్పీటీసీ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్, ఎంపీటీసీలు నారాయణరెడ్డి, తిరుపతయ్య, పార్టీ నాయకులు దేశ్యానాయక్, రమణారెడ్డి, నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు అండగా సర్కార్

- తెలంగాణ అన్ని రంగాల్లో నం.1
- పరిశ్రమల ఖిల్లాగా రంగారెడ్డిజిల్లా
- షాబాద్ మండలం సీతారాంపూర్‌లో 1148 ఎకరాల దేవాదాయశాఖ భూమిని సేకరించిన టీఎస్‌ఐఐసీ
- రూ.242 కోట్ల పరిహారం రైతులు, దేవాదాయ శాఖ ఖాతాల్లో జమ
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి., గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డా. పట్నం మహేందర్‌రెడ్డి
- షాబాద్ మండలం సీతారాంపూర్ దేవాదాయ శాఖ భూములు కోల్పోయిన 335 మంది రైతులకు ఇండ్ల స్థలాల పట్టాలు అందజేసిన మంత్రులు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్, ఎంపీ, ఎమ్మెల్యే

షాబాద్, సెప్టెంబర్ 30 : సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్లలో షాబాద్ మండలంలోని సీతారాంపూర్ పారిశ్రామికవాడలో భూములు కోల్పోయిన 335 మంది కౌలు రైతులకు ఇండ్ల స్థలాల పట్టాలను రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, షాబాద్, మొయినాబాద్ జడ్పీటీసీలు పట్నం అవినాశ్‌రెడ్డి, కాలె శ్రీకాంత్, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి తదితరులతో కలిసి మంత్రులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ.. పారిశ్రామిక, వ్యవసాయ, విద్య, వైద్య, తదితర అన్ని రంగాల్లో దేశం అబ్బురపడేలా తెలంగాణలో అభివృద్ధి సాగుతున్నదన్నారు. పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అనువైన ప్రాంతం కాగా, రంగారెడ్డిజిల్లా పరిశ్రమల ఖిల్లాగా మారిందన్నారు. రంగారెడ్డిజిల్లాలోని మహేశ్వరం, చేవెళ్ల తదితర నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు ఏర్పాటవుతున్న తరుణంలో భూ నిర్వాసితులకు సైతం ప్రభుత్వం ఎలాంటి నష్టం కలుగకుండా వారికి నష్టపరిహారాన్ని అందిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా సీతారాంపూర్‌లో టీఎస్‌ఐఐసీ సేకరించిన 1148 ఎకరాల భూముల పరిహారం కోసం ఎకరాకు రూ.10.50 లక్షల చొప్పున కౌలు రైతులకు, దేవాదాయ శాఖకు మొత్తంగా రూ.242 కోట్లను అందించనున్నట్లు వివరించారు. దేవాదాయశాఖకు రూ.89 కోట్లను ఇప్పటికే చెల్లించగా, త్వరలో మరో రూ.31 కోట్లను అందించనున్నట్లు పేర్కొన్నారు. కౌలు రైతులకు వారి ఖాతాల్లో రూ.121 కోట్లు జమ చేశామని, వారికి ప్రస్తుతం ఎకరాకు 121 గజాల చొప్పున ఇండ్ల స్థలాలను అందిస్తున్నామని వెల్లడించారు. త్వరలో ఈ స్థలాలకు సంబంధించిన ప్లాట్లలో బీటీ రోడ్లు, విద్యుద్దీకరణ, పార్కులు, తాగునీటి సరఫరా లాంటి మౌలిక సదుపాయాలు కల్పించి పూర్తి స్థాయిలో ఇండ్ల నిర్మాణాలకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రపంచ దేశాల నుంచి ఇక్కడికి పెద్ద ఎత్తున కంపెనీలు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో షాబాద్ మండలంతో పాటు చేవెళ్ల నియోజకవర్గం ఊహించని రీతిలో అభివృద్ధి చెందడం ఖాయమని మంత్రులు స్పష్టం చేశారు.

### ప్రపంచ దేశాలకు పాకిన షాబాద్ పేరు

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ హయాంలో షాబాద్ పేరు ప్రపంచ దేశాలకు తెలిసొచ్చేలా తయారైందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతున్నట్లు తెలిపారు. కంపెనీల ఏర్పాటు కోసం సీతారాంపూర్ దేవాదాయశాఖ భూమిని తీసుకున్న ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతో పాటు వారికి ఇండ్ల స్థలాలు అందిస్తున్నని ఆయన తెలిపారు.

### పేద ప్రజలకు అండగా..

జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తున్నదన్నారు. పరిశ్రమల ఏర్పాటులో భూములు కోల్పోయిన సీతారాంపూర్ రైతులకు రూ.కోట్ల విలువ చేసే ఇండ్ల స్థలాలు అందించడం గొప్ప పరిణామమని పేర్కొన్నారు. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం న్యాయం చేస్తున్నదని అనితారెడ్డి తెలిపారు.

### అభివృద్ధి పథంలో చేవెళ్ల నియోజకవర్గం

ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. నగరానికి దగ్గర్లో ఉన్న చేవెళ్ల నియోజకవర్గంలో పెద్ద పెద్ద కంపెనీలు రావడంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. షాబాద్ మండలంలోని చందనవెళ్లి, హైతాబాద్, సీతారాంపూర్, శంకర్‌పల్లి మండలం కొండకల్‌లో ఏర్పాటు చేస్తున్న వివిధ కంపెనీల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ చిన్నప్పలనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ మధు, బీఆర్ఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు ప్రభాకర్, షాబాద్ మండల అధ్యక్షుడు నర్సింగరావు, సీతారాంపూర్ సర్పంచ్ పాండురంగారెడ్డి, ఉప సర్పంచ్ సందీప్, అధికారులు, గ్రామస్తులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు

- మహేశ్వరంలో రూ.4.20 కోట్లతో గిరిజన వసతి గృహం
- రూ.69 లక్షలతో మార్కెట్ షెడ్ యార్డు
- రూ.5 కోట్లతో గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలు
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రులు సబితారెడ్డి, సత్యవతి రాథోడ్


సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్, చిత్రంలో మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 30 : అన్ని కులాలకు ఆత్మ గౌరవ భవనాలను నిర్మిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరంలో రూ.69 లక్షలతో మార్కెట్ షెడ్డు , రూ.4.20 కోట్లతో గిరిజన వసతి గృహం, రూ.5 కోట్లతో సంక్షేమ బాలుర పాఠశాలకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ రంజిత్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం సేవాలాల్ దేవాలయం, కుల సంఘాల ఆత్మ గౌరవ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధిలో దూసుకుపోతున్నన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి మంత్రి సత్యవతి రాథోడ్ విద్యాలయాలకు రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తితో నియోజకవర్గంలో 24 కులాలకు ఆత్మగౌరవ భవనాలను నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. రూ.15 కోట్లతో ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. అర్హులైన పేదలకు 75 గజాల స్థలాలను కేటాయించనున్నట్లు తెలిపారు. మన్‌సాన్‌పల్లిలో 5 ఎకరాల్లో పేదలకు ఇండ్ల పట్టాలను అందజేస్తున్నామని ఆమె వెల్లడించారు. ఇంటి జాగ ఉన్నవారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలను అందజేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని తెలిపారు. సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించి తనను నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని ఆమె కోరారు. అనంతరం ఉప్పుగడ్డతండా, కొత్తతండా, గంగారంతండా, దిలావర్‌గూడ, ఎన్‌డీతండాలకు చెందిన పేదలకు ఇండ్ల పట్టాలను మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి సబితారెడ్డి పంపిణీ చేసారు.

### ఎరుకల సంక్షేమం కోసం రూ.62 కోట్లతో ఎంపవర్‌మెంట్ పథకం

తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ 48 కుల సంఘాలకు ఆత్మ గౌరవ భవనాలను నిర్మిస్తే దానిని ఆదర్శంగా తీసుకొని 24 కుల సంఘాలను నిర్మిస్తున్న ఘనత మంత్రి సబితారెడ్డికే దక్కుతుందని సత్యవతి రాథోడ్ తెలిపారు. ఒకే రోజు 9 కుల సంఘాల ఆత్మ గౌరవ భవనాలకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఏనాడూ గిరిజనులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వెయ్యికి పైగా గురుకులాల్లో 7 లక్షల మంది విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. నగరం నడిబొడ్డున రూ.5 కోట్లతో ఎరుకల భవనాన్ని నిర్మించబోతున్నామని చెప్పారు. ఎరుకల సంక్షేమం కోసం రూ.62 కోట్లతో ఎంపవర్‌మెంట్ పథకం ప్రవేశపెట్టినట్లు మంత్రి పేర్కొన్నారు.

### ఆరు గ్యారెంటీలకు వారెంటీ లేదు

కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలకు వారెంటీ లేదని ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం మన రాష్ట్ర పథకాలను కాపీ కొడుతున్నదన్నారు. రాష్ట్రంలో రాబోయే ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీదే అని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని కులాలకు సముచిత స్థానం లభిస్తున్నదన్నారు. నియోజకవర్గానికి ఎనలేని సేవలందిస్తున్న మంత్రి సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, ఎంపీపీ సునీతానాయక్, సహకార బ్యాంక్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, తహసీల్దార్ మహమూద్‌అలీ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.


కాగ్నా వాగు తాత్కాలిక వంతెనపై పొంగిపొర్లుతున్న వర్షపు నీరు

# కురిసిన వర్షం.. పొంగిపొర్లిన వాగులు

**రాకపోకలకు అంతరాయం.. నీటితో నిండిన పంట పొలాలు**

ధారూరు, సెప్టెంబరు 30 : ధారూరు మండల పరిధిలోని దోర్నాల్–ధారూరు స్టేషన్‌ల మధ్య కాగ్నా వాగు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పొంగిపొర్లుతున్నది. నాగారం, ఎబ్బనూర్, నాగసముందర్, దోర్నాల్ తదితర గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో దోర్నాల్, అంపల్లి, గురుదోట్ల తదితర గ్రామాలకు ప్రయాణించేందుకు అంతరాయం ఏర్పడింది. ధారూరు–నాగసముందర్ మధ్య గల వాగు పొంగిపొర్లుతుండడంతో ముందస్తు చర్యగా ధారూరు పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. మండలంలోని చెరువులు, వాగులు, కుంటల్లోకి భారీగా నీరు చేరుకున్నది. పంట పొలాలు నీటితో నిండిపోయాయి.


ధారూరు–నాగసముందర్ వాగు వంతెనపై ప్రవహిస్తున్న వర్షపు నీరు